# పల్లెటూరు సైకిలు పట్నవాసం వస్తే

పల్లెటూరి పశువు పట్నవాసం రావడం తటస్థిస్తే సాధారణంగా అది బెదురుగొడ్డయిపోతుంది. పల్లెటూరిమనిషి పట్నవాసంవస్తే తనవింతచూపుల్తో అతగాడు పల్లెటూరుగబ్బే అనిపించుకుంటాడు. పశువు, మనిషీకూడా ప్రాణంకలవి కాబట్టి వానికి స్థలభేదాన్నిబట్టి అవస్థాభేదంకూడా కలగడం సహజమే. కాని సైకిలువంటి నిర్జీవపదార్థం, పక్షిఘడియలు ఒళ్లోమోస్తే వాడి కాళ్ళకిందపడి తొక్కుల్లాడుతూవుండడానికి పుట్టబడ్డ ఇనపచక్రం పల్లెటూరినుంచి పట్నవాసంవస్తే అవస్థాభేదాన్ని పొందింది అంటే ఆశ్చర్యంగానే వుంటుంది. కాని నాఅనుభవంలో అట్లాంటిది ఒకటి జరిగింది. దానిని వున్నది వున్నట్లు మీకు చెపుతాను. మాబావలాగున మీరుకూడా నన్ను హేళన చేయవద్దని మాత్రం ముందుగా మనవి చేసుకుంటున్నాను.

నేను స్కూలుఫైనల్ రాజమండ్రిలో ప్యాసై ఎఫ్ఫేచదవడానికిగాను మదరాసు వచ్చేను. ఎఫ్ఫే మదరాసులో చదివితే తరవాత ఇంజనీరింగు కాలేజీలోకాని, మెడికల్ కాలేజీలోకాని సీటు సులంగా దొరుకుతుందని నాఊహ. పెద్దలుకూడా అల్లాగే చెప్పేరు. సరే మద్రాసువచ్చి మాబావగారింట్లో మకాంవేశాను. సీటు దొరికింది. కాని కాలేజీకీ మావాళ్లబసకూ చాలాదూరం. హాస్టల్లోవుండడం కాని, రోజూ బస్సుమీద కాలేజీకి వెళ్లిరావడం కాని వ్యయసూలకం. కాబట్టి సైకిలువుంటే బాగా వుంటుందనే వూహపోయింది. కొత్తసైకిలు కొందామని అనుకొని మా అన్నయ్యకు వ్రాశాను.

మావాడు రాజమండ్రితాలూకాలో ఒకగ్రామానికి కరణం. కరణాలు అనడంతోటే లెక్కాడొక్కా వ్రాయడంలోనూ, నిదానంలోనూ చాలానికార్సుగా వుంటారు కాదండి, మరి! ఏసాగుబడిలెక్కలు తయారుచేస్తున్న సమయాన్నో మాఅన్నయ్య నాకు జబాబువ్రాశాడు: 'నీవు తొందరపడి కొత్తసైకిలు కొనవద్దు, పైసంవత్సరం నువ్వు ఎల్లాగా కాలేజీ హాస్టల్లోనే జేరాలని అనుకుంటున్నావు, ఇప్పుడు కొత్తసైకిలుకొంటే హాస్టల్లోచేరినతరువాత వుపయోగంలేకుండా పోతుంది, ప్రస్తుతావసరానికి కాబట్టి నాసైకిలు పంపిస్తున్నాను, జాగ్రత్తగా వాడుకో.'

మాఅన్నయ్య సైకిలుఅంటే రాజమండ్రి తాలూకా ఆఫీసులో అందరి గుమాస్తాలకు, అందరి రివిన్యూ ఇనస్పెక్టరులకు, చాలామంది కరణాలకు బాగా పరిచయమైనవస్తువు. మాఅన్నయ్య నెల్లాళ్లకు ఓసారన్నా నీళ్లుపోసుకుంటాడు కాని సైకిల్నిమాత్రం ఎప్పుడూ తుడవడు. తాలూకాఆఫీసులో ఏయిద్దరేనా మాట్లాడుకునే సందర్భంలో ఏదైన అసహ్యమైన వస్తువునిగురించి చెప్పవలసివస్తే మాఅన్నయ్య సైకిల్నిపేర్కొని దానికంటె అసహ్యంగావుందని చెప్పుకుంటారు. అల్లాంటిసైకిల్ని పంపిస్తానంటే నేను ఏమనాలో నాకే తెలియదు.

పంపించమంటే దానితోఅవస్థే. పంపించవద్దంటే మాఅన్నయ్యని లాఘవపఱచినట్లు అవుతుంది. ఏమని వుత్తరంవ్రాయడానికి పాలుపోవక రెండు మూడురోజులు తటపటాయించేను. నేను ఇంకా జబాబువ్రాయనేలేదు. ఒకానొక శనివారంటపాలో మా బావగారికి మాఅన్నయ్యదగ్గరనుంచి వుత్తరం వచ్చింది. విప్పిచూసేసరికి అందులో రైలుప్యాసూ, వుత్తరంవున్నాయి. వుత్తరం బహుక్లుప్తంగావుంది. 'సైకిలు పంపిస్తున్నాను. రైలుప్యాస్ ఇందులో వుంచడమైంది. వెంటనే డెలివరుతీసుకుని సైకిలు క్షేమంగాచేరిన వయినం తెలిపేది.' అని మాత్రం వుంది.

సైకిలు క్షేమంగా చేరినవయినం తెలిపేదిట! ఈ క్షేమశబ్దంలో ఏదోగంభీరార్థంవున్నట్లు నాకు అపు

తేలోచింది. అచ్చటివారి యోగక్షేమాలు తెలపలేదు, ఇచ్చటివారి యోగక్షేమాలు తెలపమనికోరలేదు. తెలపమనికోరిందల్లా సైకిలుక్షేమంగా చేరినవయినం!

కళ్యాణంవచ్చినా, కక్కువచ్చినా ఆగనట్టే మా అన్నయ్యకు దయవచ్చినా ఆగదని తేల్చుకున్నాను. సైకిలుసంగతి ఎటుక్కపోయి వ్రాశాననుకున్నాను. మాఅన్నయ్య సైకిలుసంగతి మా బావకు బాగా తెలియదు కాని మా అక్కయ్యకు బాగాతెలుసు. మా అన్నయ్యవుత్తరం చదవడంతోటే నేను పడ్డ నిరుత్సాహం పోల్తిపట్టి ఆమె అందికదా 'ఎల్లాంటి సైకిలు అయినా ఈఊరు తారురోడ్లమీద బాగానే పోతుందిరా' అని.

పోయినా పోకపోయినా నేను ప్రస్తుతంలో సెంట్రల్ స్టేషన్‌కుపోయి సైకిల్ని ఇంటికి తీసుకురావలసివుంది. సరే రెండు మెతుకులుతిని బయల్దేరా.

నేను సరిగ్గా గుమ్మందిగేటప్పటి ఇద్దరు తెనుగువాళ్లు 'పల్లెటూరినుంచి పట్నవాసం రావడంతోటే ఎల్లాంటివాడి ఆరోగ్యమైనా పాడవుతుందనుకో, బ్రదర్'అని అనుకుంటూ ఆదారిని పోతున్నారు. నేను యీమాటల్ని అప్పటికి బల్లిపలుకుల్లా భావించలేదు కాని తరవాత వాటిని భగవంతుడు నాకోసకే వాళ్లచేత అనిపించాడా అని అనిపించింది.

మనవంటి ప్రాణులికి నీరు, గాలి అవసరం. నీరు, గాలి మారడంచేత మనవంటి ప్రాణులికి ఆరోగ్యంలో మార్పుకలిగితే కలగవచ్చు కాని సైకిలికి అట్లాంటిది జరగదని నా అభిప్రాయం. కాని ఎవరో వెనకనుంచి నీరంటే అక్కర్లేదుకాని సైకిలికి గాలి కావాలిగా అంటూ అన్నట్లయింది. ఇల్లాంటి తలపుల్తో నాడి, నడక మందగించగా నేను సెంట్రల్ స్టేషన్ చేరుకున్నాను. సైకిలు డెలివర్ తీసుకున్నాను. అక్కడి సేవకులు ఎవరూ యీసైకిల్ని గమనించినట్లులేదు కాని గుమాస్తామాత్రం నాకేసి, సైకిలుకేసి ఒకసారి ఎగాదిగా మాసి చిరునవ్వునవ్వి తిరిగి తనపనిలో నిమగ్నుడయ్యాడు.

చేతిలోకి వాహనంవచ్చింది. రైలుఎక్కి తీవిగా మూడువందల అరవై మైళ్ళనుంచి శ్రమలేకుండా వచ్చిన సైకిలు నన్ను ఇంటిదాకా తీసుకునిపోలేకపోతుందా అనుకున్నాను. రోడ్డుమీదకువచ్చి దాన్ని చూస్తునుగదా చక్రాల్లో గాలిలేదు. అరటిడిప్పల్లా అంటుకుపోయివున్నాయి. ఇక దాన్ని శ్రమపెట్టడం ఇష్టంలేక నేనూ అదీ కూడా బస్సుమీద ఇంటికి వచ్చాము. గుడ్డిముసలిముష్టివాడిని నడిపించుకుంటూ వచ్చే కుర్రాడిలాగున నేను సైకిల్ని నెమ్మదిగా నడిపించుకు వస్తూవుండడం కిటికీలోంచి చూచి మా బావతమ్ముడు నాకూ, నావాహనానికి స్వాగతం ఇవ్వడానికి వీధిలోకి వచ్చేడు.

హంసగమనాన్ని, గజగమనాన్ని ధిక్కరించే మెత్తకాళ్ళతో నేనూ, డొప్పటైర్లతో నాసైకిలూ ప్రత్యక్షమయ్యేసరికి ఆమానవుడు నిర్ఘాంతపోయి 'ఏమోయ్ రెంచికావాలా అంటూ' లోపలికి మళ్లేడు. సయికిలు కొత్తవూరు వచ్చింది కాబట్టి గాలిలో మార్పు ఎల్లాగావుంటుంది. అందులో ఆవూరినుంచి అసలు గాలిలేకుండా వచ్చింది. వెంటనే గాలి ఎక్కిస్తేకాని ప్రమాదం జరగవచ్చు అని అనుకొని పక్కయింటివారి పంపు అడిగిపుచ్చుకుని గాలి ఎక్కించడానికి ప్రయత్నించాం. పోసినగాలిఅంతా ఏగోతులో పడిపోతోందో టైర్లుమాత్రం వుబ్బలేదు.

పల్లెటూర్లో అనగా మా అన్నయ్య దగ్గర వున్నప్పుడు అతగాడు అకటావికటపు పంపుతో అట్లాయిట్లా అన్నా- మావదిన ఆఖరుకి తాటాకువిసినికర్రతో విసిరినా గాలిపోసుకునే సైకిలు ఇక్కడ ఇల్లా వుండడానికి కారణం ఏమిటిచెప్మా అనుకున్నాను. పల్లెటూర్లో ఏమాత్రం గాలితగిలినా ఒంటబట్టించుకునే యీసయికిలు ఇక్కడ ఇంత ప్రయత్నంచేసినా పిసరంతేనా గాలిని ఒంటబట్టించుకోలేక పోయినందుకు నాకు అనుమానంతోచింది. గాలి ఎన్నిసారులు కొట్టినా రుచించని అన్నంలాగ- ఇమడకుండావుంది. టైర్లకు దారిలో ఏ కొరుకుపేట స్టేషంలోనో చిట్లఫిరంగి తగిలివుండాలని నిశ్చయమైంది. అప్పుడు టైర్లు విడతీసి జాడ్యలక్షణాలుగ

భాగాల్ని సుత్తించి కష్టపడి నేనూ, అతను చికిత్స చేసి గాలిని ఒంటబట్టించుకునే స్థితిలోకి దాన్ని తెచ్చేము.

నా రథాన్ని నేను గమనానికి తయారుచేసుకునే సరికి సూర్యభగవానుడు తన సప్తరథాలతో పశ్చిమ సముద్రంలో పడిపోయాడు. వీధులలో ఎలక్ట్రిక్ దీపాలు వెలిగించారు. సరదాగా ఓసారి ఆవీధులలో సయికిల్ మీద ఓచక్రా కొట్టివద్దామనిపించింది.

వీధులోకి తెచ్చేను, నెమ్మదిగా ఎక్కేను. నడక ప్రారంభించింది. కాని పాపం గాభరాపడిపోయింది. గొడ్డుఅమావాస్యరోజులలోకూడా అది యింతవరకు లైటు అన్నది ఎరగదేమో ఇక్కడి మెఱుపుదీపాలు చూచి గాభరాపడిపోయింది. ఆగాభరాతో దానికి అన్ని అవయవాలు స్వాధీనం తప్పేయి. చేలగట్ల మీద, పోరంబోకులతోనూ, గోదావరి లంకగుబ్బల లోనూ, వేసీవేసే కంకరరోడ్ల మీద, ఇసుక తిప్పల లోనూ నడవడానికి చిరకాలంగా అలవాటుపడి వున్నదేమో దానికి నున్నటి యీతారురోడ్ల మీద కాళ్లు ఆనేవికావు. ఎంతమోగించినా గంట మోగేదికాదు, ఎంతనొక్కినా బ్రేకులు పడేవికావు.

గంటమోగకపోవడంచేత వాక్కు పడిపోయిందని, బ్రేకులుపడకపోవడంచేత కర్మేంద్రియాలు స్వాధీనం తప్పేయి అనీ సయికిలుకు కలిగిన వ్యాధినిరూపణం ఈమధ్య మందులకేటలాగులు చదివి వైద్యుణ్ణి అవుతూవున్న నేను చెయ్యగలిగేను. వ్యాధి ఇంకా చక్రాలకిమాత్రం పాకలేదు. నున్నటిగోడ్ల మీద నిలిచినా నిలవకపోయినా అవి నడకమాత్రం సాగించేవి. నేను చెప్పిన దిక్కుకి కాకపోయినా ఏదో దిక్కుకి నడిచి ఈఅవయవాలు స్వాధీనంతప్పలేదని మాత్రం నాకు నిరూపించి చెప్పినందుకే నేను చాలా సంతోషించేను. ఒక అరగంటమొత్తంమీద దానితో దేవులాడేను. ఆకొద్దిసేపటి పరిచయంతో దానికి ఉన్న ఈక్రింది లక్షణాల్ని పోల్చుకోగలిగేను.

మొదటిలక్షణం ఏమిటంటే మోటారువచ్చి నా కాని దారిలో తప్పుకోకపోవడం. సయికిలుకంటె అన్నివిధాలా మోటారు అధికమైంది. దాన్నిచూచి ఇది వినయంచూపి తొలగకపోవడం జాడ్యలక్షణం కాని మరొకటికాదు.

రెండోలక్షణం ఏమిటంటే నేను దాన్ని తొక్కిన అరగంటసేపట్లోను దానికి కనిపించిన రెండు మూడు రిక్షాలమీదికి ముందుచక్రాన్ని దాకొల్పి వీలయితే వాటిమీదికి ఎక్కడం. ఆసయికిలు రెండెడ్ల బళ్ళనీ,ఒంటెద్దు బళ్ళనీ, మోటారుకార్లనీ,బస్సుల్నీ చూసివుందికాని రిక్షాలనిమాత్రం చూసివుండలేదు. సెంట్రల్ స్టేషన్ నుంచి ఇంటికి వచ్చేటప్పుడనా దాన్ని రిక్షాఎక్కించి తీసుకురావలసింది. దూరదృష్టి బొత్తిగా లేకుండా దాన్ని బస్సు ఎక్కించుకు తీసుకువచ్చేను. వింతగావున్న రిక్షాల్ని చూడ్డంతోటే దానికి మోజుపుట్టేదికాబోలు అమాంతంగాపోయి వాటిని కౌగలించుకొనేది. రిక్షాలంటే ఇంతటి మోహతాపాలకి గురికావడంకూడా ఒక జాడ్య లక్షణమే అనుకోవాలి.

ఇక మూడోలక్షణం ఏమిటంటే వీధులలో మలుపులు తిరగవలసివస్తే మూలగోడల్ని ముద్దుపెట్టుకోకుండా తిరిగేది కాదు.

ఇట్లా ఈ లక్షణాలన్నీ గమనించిచూస్తే ఇది ఒకరకపు జడుపురోగమని నిర్ణయించగలిగాను. జడుపురోగంలోను ఇది కొద్దిపాటిది కాదనికూడా అనుకోవలసివుంటుంది. కొద్దిపాటి జడుపురోగమైతే వీపు చరచటం మొదలైన సూక్ష్మప్రక్రియలు పనిచేస్తాయి కాని ప్రబలమైన ఇట్టి జడుపులికి ప్రబలమైన చికిత్సలు,దిగదుడుపులు మొదలగునవి చేయాలి. వ్యాధి ప్రాబల్యాన్నిబట్టి చికిత్స మార్చాలి. బ్రేకులు పని చేయడానికి, గంటమోగడానికి సుత్తిదెబ్బలు మొదలైనవి పనిచేస్తాయేమోనని ప్రయత్నించేను. కాని కార్యకారికాలేదు. వ్యాధి రోష్టు చెయ్యాలి అన్నారు కాబట్టి బజారులో పెడితేకాని ఇది బాగుపడదని నిశ్చయించుకొని నెమ్మదిగా ఇంటికి వచ్చేను.

నా అవస్థ ఇంట్లోవాళ్ళకి అవగతమైంది. మాబావకాని, అతని తమ్ముడుకాని, మా అక్కయ్యకాని నన్ను సయికిల్నిగురించి ఏమీ అడగలేదు. బొగ్గుల బస్తాకి ప్రక్కగా ఓమూలని దాన్ని వుంచేసి మా మూలుగ భోజనానికి లేచాను. ఎన్నికబుర్లో ఎత్తి మాట్లాడాము. సయికిలుసంగతిమాత్రం రాలేదు. ఆ సంగతి రాకపోవడమే నాకు ఆనందంగావుంది.

మర్నాడు ఉదయాన్నే లేచి సయికిలు నేనూ బజారుకు బయలుదేరాము. కనీసం ఓ అయిదు రూపాయిల నోటన్నా దిగదుడిచి దీనిమొఖాన పొయ్యకపోతే రోగం కుదరదని జేబులో ఓఅయిదు రూపాయిల నోటు భద్రపరిచాను. సయికిళ్లరోగాలు కుదర్చడానికి బోర్డుకట్టిన డాక్టరు వద్దకు దాన్ని తీసుకుని వెళ్లేను. ఆడాక్టరు సయికిల్ని స్తనశల్యపరీక్ష చేసి వ్యాధి ప్రబలమైపోయిందనీ; వ్యాధిచర్మగతమే కాకుండా రక్తగతం, మాంసగతం, అస్థిగతంకూడా అయిపోయిందనీ; ఇప్పుడు ఏంచేసినా తత్కాలికంగా కొంత శాంతి కనిపిస్తుందేకాని వ్యాధి మొదలంటా పోదనీ; మాసానికో పదిహేనురోజులకో సారి డాక్టరుకి చూపించవలసి వుంటుందనీ; సప్తధాతువుల్నీ శోధించవలసి వుందనీ అట్లా సప్తధాతుశోధనచేయడంకంటె కొత్తసయికిలు కొనుక్కోవడమే మంచిదనీ చెప్పేడు. కొత్తసయికిలు కొనుక్కోవడంసంగతి అల్లావుంచి ప్రస్తుతంలో ఏదేనా కొంత చికిత్సచేసి దీన్ని మార్గంలో పెట్టమన్నాను. సరే దాన్ని అక్కడవుంచేసి సాయంకాలం రమ్మనమని అన్నాడు.

సాయంకాలందాకా ఎట్లో పొద్దుపుచ్చి అతగాడి వద్దకు పోయాను. తలంటుకొన్న క్షయరోగిలాగ అచ్చటి వికారస్వరూపంతో నాసయికిలు విరాజమానం అవుతూవుంది. పట్టిచూచాను, నడిపించిచూచాను. టడపడలాడ్డం పూర్తిగా తగ్గకపోయినా సయికిలికి గాభరా కొంతవరకు తగ్గింది. బ్రేకులు కొంతవరకు సయికిలు చక్రాల్ని అస్పృశ్యులుగా చూడ్డం మానివేశాయి. వినిపించుకునేవారికి వినపడేటంత బిగ్గరగా- అనగా మా రామచంద్రుడు మామగారి ముప్ఫయిసంవత్సరాల అలారము గడియారం అలారం కొట్టేటంత బిగ్గరగా- పరధ్యాన్నంగా ఉన్నవారికి వినపడనంత మెల్లగానూ అనగా బొత్తిగా ప్రకాశంగా కాకుండా మధ్యరకంగా గంట మోగేది. అసలే వాక్కుపడిపోయినదానికి ఈ మాత్రం మాటవచ్చినందుకు సంతోషించవలసిందే. ఐదు రూపాయిలు వదిలితే వదిలాయికాని సయికిలు మాత్రం అవసరమైనేవ్యం పెట్టడానికి పనికివచ్చేటట్లుగా తయారైందికదా అని సంతోషించేను.

ఆనాడు కాలేజీకి నేను ఆసయికిలుమీదనే వెళ్ళేను. మధ్యదారిలో ఎక్కడా నేను గంటవాయించవలసిన అవసరం కలగలేదు ఏమంటారా? నా సయికిలు పోతూవుంటే మునిసిపల్ తుక్కుడబ్బాలు దొర్లించినప్పుడు అయేశబ్దంలాంటిది నిరంతరమూ అయేది. అందుతో అల్లంతదూరాన్ని వుండగానే ఎంత పరధ్యాన్నంగా వున్నవారికైనా తన నాదబ్రహ్మంతో అది మేలుకొల్పేది. మేలుకొని అందరూ దానికి దారియిచ్చేవారు. కాలేజీ కాంపవుండులో చేరేసరికి మాత్రం ఈశబ్దం అనుగ్రాళ్ళని ఒత్తిగించలేక పోయింది. వారిలో కొంతమంది నాసయికిలుకు అడ్డం వచ్చి గాలివిమానం వాలుతోంది అనుకున్నామురా అని హేళనచేయడం మొదలుపెట్టేరు. వాళ్ళ హేళనముందు నాకు ధాతువులు ఆగలేదు. ఇక ఆ సయికిలుమీద కాలేజీకి రాకూడదనుకున్నాను. ఆనాటిమాత్రం ఎట్లాగో దానిమీద ఇంటికివచ్చి బొగ్గులబస్తామూల దాన్ని ప్రవేశపెట్టేను. అప్పుడప్పుడుతీసి దానికి కిరసనాయిలు కొబ్బరినూనెకలిపి తైలాభ్యంగనం చేయించేవాడిని. కాని దాన్ని ఎప్పుడూ ఘోషాలోనే వుంచేవాడినికాని [illegible] నిచ్చేవాడిని కాను.

మాఅన్నమాత్రం అప్పుడప్పుడు వ్రాస్తూవుండే ప్రతివుత్తరంలోనూ సయికిల్ని జాగ్రత్తగా వాడుకుంటున్నావని నమ్ముతున్నాను అని వ్రాసేవాడు. నేను ఒకసారికూడ అతనికి జవాబులో సయికిలుసంగతి వ్రాయలేదు. ఉన్నట్టుండి మాఅన్నయ్య ఒకసారి మదరాసువచ్చేడు. దేవతార్చనపెట్టిలాగ ఒకమూలవుండిపోయి, మందేశ్వరస్వామిలాగ నూనితో మునిగి తేలుతూవున్న తనసయికిల్ని చూచి ఏమనుకున్నాడో ఏమో తానువెళ్లేటప్పుడు దాన్నికూడా తీసుకువెళ్లినాడు.

ఆసయికిలు ఇప్పటికీ అతనివద్ద పనిచేస్తూనేవుంది. చూడదలచినవారు ఈ పదిరూపాయిల టిక్కెట్లరోజుల్లో ఒకసారి రాజమండ్రీ వెళ్లి ఆప్రాంతాల్లో దాన్నిచూచి వెంటనే గోదావరిస్నానంచేసి రావలసిందని కోరుతున్నాను.

—ఉపాధ్యాయుల నారాయణరావు, బి.ఏ.